
సాక్షి గుంటూరు

ఆదివారం । 5 । నవంబర్ । 2023



రేణుకమ్మ ప్రతిష్ఠ మహోత్సవం

యడ్లపాడు: లింగారావుపాలెంలోని ఆలోకం ఇంటి పేరిట వారు తమ కులదైవం రేణుకమ్మ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠ గావించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఉషోదయ సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ శనివారం రూ. 2.16 లక్షల విరాళం అందజేసింది.

న్యూస్‌రీల్

వాహనాల తనిఖీల్లో రూ.1.46 కోట్లు వసూలు

పట్నంబజారు : వాహనాల తనిఖీల్లో భాగంగా అక్టోబరు మాసానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించినట్లు డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి అక్టోబరు నెలలో వాహనాల తనిఖీల లక్ష్యం రూ.1.17 కోట్లుగా నిర్ణయించగా, రూ.1.46 కోట్లు సాధించినట్లు తెలిపారు. జిల్లాలోని 11 మంది ఎంవీఐలు సమష్టిగా కృషి చేసి 1,188 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.1.46 కోట్లు అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు వెల్లడించారు.

రూ.కోటి విలువైన భూమి ఆక్రమణ

- అనధికారికంగా భవన నిర్మాణం
- అడ్డుకున్న అధికారులు



మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు టిడ్కో నివాసాలకు అనుకుని సర్వే నంబర్ 224లో రూ.కోటి విలువైన పోరంబోకు భూమి ఆక్రమణకు గురికావడం స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికంగా ఉండే ఓ పాస్టర్ 500 చదరపు గజాలకుపైగా ప్రభుత్వ డొంక పోరంబోకును ఆక్రమించడంతోపాటు అందులో అనధికారికంగా రూ.కోట్లు పెట్టి భవన నిర్మాణమూ మొదలుపెట్టాడు. ఈ విషయం శనివారం కార్పొరేషన్ అధికారుల దృష్టికి రావడంతో వారు వెంటనే అక్రమ కట్టడాన్ని నిలిపివేశారు. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్‌ను వివరణ కోరగా స్థలం ఆక్రమణ, అందులో అనధికార కట్టడంపై తమ దృష్టికి వచ్చిన వెంటనే నిర్మాణాన్ని ఆపేశామని, కట్టడాన్ని తొలగించి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు చేపడతామని వివరించారు.

స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ



చేబ్రోలు: క్షేత్ర స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం రాత్రి తనిఖీ చేశారు. చేబ్రోలులోని బీసీ బాలికల వసతి గృహాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు అందుతున్న మెనూ, రికార్డులను పరిశీలించారు. మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని శేకూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలోని విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వాడకం, జగనన్న కిట్లు, నోట్ బుక్స్, విద్యాబోధన తదితర అంశాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట స్థానిక ఎంఈవో ప్రసాద్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన 'నాన్న నేనొచ్చేస్తా'

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ గానగంధర్వ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రదర్శించిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక సందేశాత్మకంగా సాగింది. ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలోని నలుగురు విద్యార్థులు కథ రాసి, వారే దర్శకత్వం వహించిన ఈ ప్రదర్శన చేశారు. సామాజిక అంశాలపై సాగిన ఈ ప్రదర్శన యూనివర్సిటీ విద్యార్థులను ఆలోచింపజేసింది. ప్రదర్శనను తిలకించిన అనంతరం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తన స్పందన తెలియజేస్తూ తన కుటుంబంలోని కొన్ని ఘట్టాలను గుర్తు చేసుకున్నారు.

బహుజన గర్జన

- పెత్తందార్లపై సమరభేరి
- సామాజిక సాధికార బస్సు యాత్రకు నీరాజనం
- గుంటూరు తూర్పు నియోజకవర్గంలో బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా
- సంగడిగుంటలోని మహానేత విగ్రహం వద్ద భారీ కటౌట్లతో నేతలకు స్వాగతం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు, నాయకులు, కార్యకర్తలు
- గుర్రపు బగ్గీ, బాణసంచా, కోలాటం, గిరిజన నృత్యాలతో సందడి

'తూర్పు'న నవ కిరణాలు మెరిసినట్టు..
సంగడిగుంట ఉక్కుపిడికిలెత్తి గాండ్రించినట్టు.. సామాజిక గుండె చప్పుడు తప్పెట గుళ్లై మార్మోగినట్టు.. 'నారా'కాసుర సేనల దహనానికి బాణసంచా ఎగసిఎగసిపడినట్టు.. దిక్కులన్నీ ఒక్కటై.. బాటలన్నీ జన ఉప్పెనై గుంటూరు రణన్నినాదమై గర్జించింది. జయభేరి మోగించింది. బహుజన జెండాను రెపరెపలాడిస్తూ.. పెత్తందార్లపై సమరనాదంతో కదంతొక్కింది. గిరిజన నృత్యాలతో వైఎస్సార్ సీపీ బస్సు యాత్రకు అడుగడుగునా నీరాజనాలు పలికింది. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్న నవ్యాంధ్ర నవరత్నను కీర్తించింది. జయహో జగన్ అంటూ గళమెత్తింది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు/పట్నంబజార్/ఎడ్యుకేషన్ : గుంటూరు నగరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్ యాత్రకు అపూర్వ స్పందన లభించింది. ప్రజలు, నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం 2:45 గంటలకు సంగడిగుంట వైఎస్సార్ విగ్రహం నుంచి బీఆర్ స్టేడియం మీదుగా బస్సు యాత్ర సాగింది. అనంతరం మాయాబజార్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రసంగించారు. గుంటూరు, కృష్ణా జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్లు ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఏసురత్నం, పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాలు ఐక్యం కావాలి

ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక విప్లవానికి తెర తీసిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, రానున్న రోజుల్లో సీఎం జగన్‌కు మద్దతుగా అన్ని వర్గాలు నిలబడాలని పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ కంకణం కట్టుకున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. బడుగు, బలహీనవర్గాలను సీఎం జగన్ రాజ్యసభకు పంపి గౌరవం పెంచారని వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అత్యున్నత పదవులు ఇచ్చారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు బీసీల తోకలు కత్తిరిస్తా అన్నారని, ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని అన్నారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం ఇచ్చిన నాయకుడు సీఎం జగన్ అని ఆయన కొనియాడారు. చంద్రబాబు అన్ని కులాలనూ అవమానించారని, సీఎం జగన్ అన్ని వర్గాలకూ సంక్షేమం అందించారని ప్రశంసించారు. ఈ తేడాను గుర్తించాలని కోరారు. నిత్యం నిజాలు మాట్లాడే జగన్ ముందు చంద్రబాబు ఆటలు సాగవని స్పష్టం చేశారు. మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మాటలతో కాకుండా చేతలతో బడుగు బలహీన వర్గాలకు సంక్షేమం అందించిన నాయకుడు సీఎం జగన్ అని చెప్పారు. గతంలో చంద్రబాబు హయాంలోనూ ఇదే బడ్జెట్ ఉందని, కానీ సంక్షేమాన్ని ఎందుకు అమలు చేయలేదని మంత్రి ప్రశ్నించారు. విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన నాయకుడు సీఎం జగన్ అని, మనకు మన కుటుంబానికి మంచి జరిగిందా లేదా అన్నది ఆలోచించుకోవాలని, మంచి జరిగితే సీఎం జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుందామని మంత్రి సురేష్ పిలుపునిచ్చారు.



సామాజిక న్యాయం శ'బస్సు' : బస్సు యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా చిత్రంలో అతిథులు, హాజరైన ప్రజలు



జైభీమ్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన మంత్రి సురేష్, మాణిక్యవరప్రసాద్ తదితరులు



నడుస్తున్న చరిత్ర : బస్సు యాత్ర అగ్రభాగాన నడుస్తున్న అయోధ్య, కావటి, వజ్రబాబు

అపూర్వ స్పందన



అట్టడుగు వర్గాలను చట్టసభలకు పంపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు గుంటూరు ప్రజలు జేజేలు పలికారు. శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గానికి వచ్చిన సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. పొన్నూరురోడ్డులోని సంగడిగుంట రోడ్డు కూడలి వద్ద ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా యాత్రకు కనీవినీ ఎరుగని రీతిలో భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు యాత్ర ప్రారంభించారు. మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జునతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు బస్సు యాత్రగా బయలుదేరారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నేతలు బస్సుపైకి ఎక్కి యాత్ర ప్రారంభించారు. మంత్రులతో పాటు మిగిలిన నేతలందరూ బస్సుపైకి ఎక్కి యాత్రలో పాల్గొనగా, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి నడిచారు. మధ్యలో డప్పు వాయిస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. ఈసందర్భంగా వందలాదిగా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరీ ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున బస్సు యాత్ర వెంట కదిలారు. బస్సు యాత్రకు ముందుగా ఆడపడుచుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యకర్తలు బాణసంచా కాల్చి సందడి చేశారు. ప్రత్యేకంగా తీసుకువచ్చిన రెండు గుర్రపు బగ్గీలకు కట్టిన నాలుగు గుర్రాలు యాత్రలో బస్సు వెనుక నడిచాయి. గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గంలోని నాయకులు, కార్పొరేటర్లు ఎక్కడికక్కడ పోటీపడి మరీ ఏర్పాట్లు చేశారు. కార్యకర్తలు పార్టీ జెండాలను భుజాన వేసుకుని అభిమానం చాటారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇతర నేతలను ఆహ్వానించడం వంటి కార్యక్రమాలను నూరి ఫాతిమా స్వయంగా పర్యవేక్షించారు.

యాత్రలో శాసనమండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీత, జిల్లాపరిషత్ చైర్మన్ కత్తెర హెనిక్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్, నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్, పార్టీ సీఈసీ సభ్యుడు తాడిశెట్టి మురళీ మోహన్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము), పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పఠాన్ ముంతాజ్, మండేపూడి పురుషోత్తం, గంజి చిరంజీవి, కోలా భవానీ, జియావుద్దీన్, బత్తుల దేవానంద్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆశయం చాలా గొప్పది



ఎమ్మెల్యే ముస్తఫా

వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ.. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా షేక్ ప్రశంసించారు. సీఎం జగన్ ఆశయం చాలా గొప్పదని పేర్కొన్నారు. నాలుగున్నరేళ్లుగా ఎన్నో పథకాలు తీసుకొచ్చారని వివరించారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా తన కుమార్తె నూరి ఫాతిమాను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

33వేల మంది పేదలకు ఇళ్లస్థలాలు



షేక్ నూరిఫాతిమా

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ వైద్యానికి, విద్యకు అధిక ప్రాధాన్యం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. టీడీపీ పాలనలో అధ్వానంగా ఉన్న గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో 33వేల మందికిపైగా పేదలకు ఇళ్లు నిర్మిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు.



యువజనభేరి : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువతరం

ఎంపీ ల్యాడ్స్ పనులు వేగంగా పూర్తిచేయాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో పార్లమెంట్ సభ్యుల నిధులతో మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2019-24 మధ్యలో గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్‌కు సంబంధించి ఎంపీ ల్యాడ్స్‌తో రూ.19.78 కోట్లతో 230 పనులు మంజూరు చేశారన్నారు. వీటిలో 65 పనులు పూర్తయ్యాయని, మరో 26 పనులు పురోగతిలో ఉన్నాయని, 139 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు యుద్ధప్రాతిపదికపై పూర్తి చేయాలని చెప్పారు. మిగిలిన పనులనూ త్వరగా ప్రారంభించి పూర్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి 2002-24కు సంబంధించి ఎంపీ లాడ్స్ నిధులతో 9.82 కోట్లతో 54 పనులు మంజూరయ్యాయని, వీటిలో 31 పనులు పూర్తయ్యాయన్నారు. 6 పనులు పురోగతిలో ఉన్నాయని, మరో 17 పనులు ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. దీంతోపాటు రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, లోక్ సభ సభ్యులు నందిగం సురేష్, బాలశౌరి మంజూరు చేసిన ఎంపీ ల్యాడ్స్ నిధులను జిల్లాకు ఉపయోగించుకోవాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో సీపీఓ శేషశ్రీ, నగరపాలక సంస్థ ఎస్ఈ పీవికే భాస్కర్ పాల్గొన్నారు.

9న విభిన్న ప్రతిభావంతులకు మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ), సమర్థనం ట్రస్ట్ ఫర్ డిసేబుల్డ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన గుంటూరు అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో విభిన్న ప్రతిభావంతులకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతల వారీగా 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈనెల 9వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 63648 67800 (801, 802, 803), 6303504995 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ విద్యార్థులకు ఉపకార వేతనాలు

కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు
సామినేని కోటేశ్వరరావు



మాట్లాడుతున్న సామినేని కోటేశ్వరరావు, పక్కన చుక్కపల్లి రమేష్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గత మార్చిలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభావంతులుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపకార వేతనాలు ప్రదానం చేయనున్నట్లు కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. శనివారం బృందావన్‌గార్డెన్స్ కుందుల రోడ్డులోని కమ్మ జన సేవా సమితిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఇంటర్, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తులు పంపాలని సూచించారు. టెన్త్‌లో 90 శాతం (9 జీపీఏ) మార్కులు వచ్చిన వారితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు దూరమైన వారు, శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు 80 శాతం (8 జీపీఏ) వచ్చినప్పటికీ అర్హులేనని పేర్కొన్నారు. అదే విధంగా తల్లిదండ్రులు ఇరువురూ లేని విద్యార్థులు టెన్త్‌లో ఉత్తీర్ణత సాధిస్తే చాలునని తెలిపారు. దరఖాస్తులను సంస్థ కార్యాలయం ద్వారా, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేజేఎస్ఎస్.ఇన్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, పూర్తి చేసిన దరఖాస్తులకు సంబంధిత ధ్రువపత్రాలను జత పర్చాలని సూచించారు. సంస్థ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికీ రూ. ఏడువేల చొప్పున ఉపకార వేతనాన్ని అందజేస్తామని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కమ్మజన సేవా సమితి ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థినులకు ప్రతి ఏటా రూ.50 లక్షల మేరకు ఉపకార వేతనాలు, ఫీజుల చెల్లింపు చేస్తున్నామని చెప్పారు. ఐఐటీల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవా సంస్థలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థులకు సమితి తరఫున అవసరమైన చేయూత అందిస్తామని, వీల్‌చైర్స్, దుప్పట్లు, ఇతర ఫర్నీచర్ కావల్సిన వారు తమను సంప్రదించాలని సూచించారు. ఉపకార వేతన దరఖాస్తుకు సంబంధించిన ఇతర వివరాలకు 8330934815, 7382620317 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో సంస్థ సభ్యులు కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, గోరంట్ల పున్నయ్యచౌదరి, వడ్లమూడి నాగేందర్, ఎంసీహెచ్ సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణ, సాంబశివరావు పాల్గొన్నారు.

నీతిపరుడైన ఉద్యోగికి త్వరలో సత్కారం

ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మత్తే



ర్యాలీలో ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర, విద్యార్థులు

నగరంపాలెం: వచ్చే ఏడాది జరగనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నాటికి ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే నీతిపరుడైన ఉద్యోగిని గుర్తించి సత్కరిస్తామని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఏఎస్పీ మహేంద్ర మత్తే అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఏసీబీ ఆధ్వర్యంలో శనివారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో వర్క్‌షాప్ జరిగింది. నగరంపాలెం జాషువా సెంటర్ నుంచి హిందూ కళాశాల కూడలి మీదగా సెంట్రల్ లైబ్రరీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీలు సత్యానందం, ప్రతాప్ కుమార్, రేంజ్ ఐజీ స్టాంప్స్-రిజిస్ట్రేషన్ డీఐజీ జి.శ్రీనివాసరావు, జిల్లా ఆర్టీఓ కరీం, జిల్లా ఆర్డీవో శ్రీకర్ పాల్గొన్నారు.

అవినీతి అంతంతోనే పురోభివృద్ధి

తాడేపల్లిరూరల్: దేశ పురోభివృద్ధి అవినీతి అంతంతో సాధ్యమని ఏసీబీ ఏఎస్పీ మహేంద్రమాతే పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అవినీతి నిరోధంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ పిలుపు మేరకు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అవినీతి నిరోధించే బాధ్యత విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

సహకార బ్యాంకులతో అన్నివర్గాలకు సంక్షేమం

- ఏపీ చాంబర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి



బ్యాంక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న రఘురామిరెడ్డి

గుంటూరు రూరల్: అన్ని తరగతుల వారి సంక్షేమం కోసం సహకార బ్యాంకులు స్థాపించటం జరిగిందని ఏపీ చాంబర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఇన్నర్ రింగ్‌రోడ్డులో విశాఖ అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంగా ఉన్న కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ 28వ శాఖను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం. వీరాచారి మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా ప్రజల అవసరాలకు సహకార బ్యాంకులు ఒక దిక్సూచీలా పనిచేస్తున్నాయన్నారు. బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంక్ స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా రజతోత్సవాలు నిర్వహించుకుంటున్న సమయంలో గుంటూరులో 28వ శాఖను ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసరావు, ఏలూరు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వై.గురవయ్య, గుంటూరు ఉమెన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ కె.వి.సుజాత, ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు, రాష్ట్ర అర్బన్ బ్యాంకుల సహకార సమాఖ్య అధ్యక్షుడు చిటూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.